సాక్షి ప్రకాశం

సోమవారం । 24 । జూన్ । 2024



కమనీయం..కల్యాణోత్సవం

పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం, రథోత్సవం నిర్వహించారు.

- 8లో..



క్రీడలతో క్రమశిక్షణ

క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని ప్రకాశం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ రవికుమార్ పేర్కొన్నారు. ఒంగోలులో ఒలింపిక్ రన్ నిర్వహించారు.

- 8లో..



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురాంతకం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లకు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ కే మధురవాణి తెలిపారు. త్రిపురాంతకం మండలం దూపాడులోని గురుకుల పాఠశాలతో పాటు, జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. 25వ తేదీ దరఖాస్తులకు చివరితేదీ కాగా, 26న ఉదయం పది గంటలకు రాత పరీక్ష ఉంటుందని చెప్పారు.

రైల్వే, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఒంగోలు: నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం రైల్వే రీజియన్లలో అసిస్టెంట్ లోకో పైలెట్ 18799 ఉద్యోగాలు, ఆర్‌ఆర్‌బీ టెక్నీషియన్ గ్రేడ్ 3 ఉద్యోగాలు 9 వేలు, ఆర్‌పీఎఫ్ 4208 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు లాజిక్ అకాడమీ డైరెక్టర్ పాలపర్తి విజయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంజయ్యరోడ్డులోని తమ సంస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద విద్యార్థినీ విద్యార్థులకు రైల్వే, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 29 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 7207012758లను సంప్రదించాలన్నారు.

పఠనాసక్తితో జ్ఞాపక శక్తి మెరుగు

- జిల్లా గ్రంథాలయ సంస్థలో 'చదవటం మాకిష్టం' కార్యక్రమం



గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకున్న చిన్నారులు

ఒంగోలు సెంట్రల్: పఠనాసక్తిని చిన్నారులు పెంచుకోవాలని దీంతో జ్ఞాపకశక్తి మరింత మెరుగుపడుతుందని జిల్లా ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. జిల్లా గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో పుస్తక పఠనం చేయించారు. సీనియర్ సిటిజన్స్ మంచికంటి వెంకటేశ్వర రెడ్డి, చావలి సుధాకర్ పిల్లలతో వినోద పుస్తకాలు, పిల్లల కథలు చదివించటం, కథలు చెప్పించారు. మేఘ ఈఎన్‌టీ వైద్యులు కొత్రపాటి సుధాకర్ ఐదుగురు విద్యార్థులకు సభ్యత్వం చెల్లించి చక్కగా చదువుకొని ఉన్నత స్థితికి రావాలని కోరారు. గ్రంథాలయ సిబ్బంది కే సంపూర్ణమ్మ, ఎస్ అనిల్ పాల్గొన్నారు.

చారిత్రక సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలి

- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం రామతీర్థంలోని శ్రీమోక్షరామలింగేశ్వరాలయం ఆవరణలో ఉన్న క్రీస్తు శకం 16వ శతాబ్దానికి చెందిన నిలువెత్తు వీరభద్రుడి విగ్రహాన్ని రక్షించి ఆలయం ఆవరణలో భద్రపరచాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి, ప్లీచ్ ఇండియా సంస్థ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్ తరాలకు అందించడానికి తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామతీర్థం ఆలయ పరిసరాలను పరిశీలించామని శివనాగిరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న వీరభద్రుడి విగ్రహం ఆలయం ఆవరణలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉందని పేర్కొన్నారు. ఈ ఆలయం ఆవరణలోనే క్రీస్తు శకం 3వ శతాబ్దం నాటి బౌద్ధ ఆనవాళ్ళను కూడా గుర్తించామని శివనాగిరెడ్డి వివరించారు. ఆలయ పరిసరాల్లో పల్నాటి సున్నపురాతి బౌద్ధ స్తంభాన్ని దానిపై అర్ధచంద్రాకార పద్మాన్ని గుర్తించామని, ఈ శిల్ప శైలిని బట్టి ఈ బౌద్ధ చిహ్నం ఇక్ష్వాకుల కాలం నాటిదని ఆయన తెలిపారు. చారిత్రక సంపద గురించి అక్కడి పూజారులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. గ్రామస్తులు ఏలూరి శేషబ్రహ్మ, పి.మహేష్, ఆర్.దశరథరామరెడ్డి, కె.పూర్ణచంద్ర తనకు సహకరించారన్నారు.

ఏం కొనేట్టు లేదు..ఏం తినేట్టు లేదు. వంటింట్లోకి వెళ్తే కూర కుదరటం లేదు.. అంతకంతకూ కొండెక్కుతున్న కూరగాయల ధరలు ఎక్కడా దిగొచ్చే పరిస్థితి కనిపించటం లేదు. దళారుల ఇష్టారాజ్యంతో రైతు నుంచి వినియోగదారునికి చేరేసరికి దాదాపు మూడు రెట్లు ధర పెరుగుతోంది. ఎండలకు తోడు.. తగినన్ని వర్షాలు లేకపోవడంతో దిగుబడులు తగ్గి డిమాండ్ పెరిగింది. ఫలితంగా ధరలకు కళ్లెం లేకుండా పోయింది.



- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- ఎండలతో తగ్గిన దిగుబడులు
- కిలో రూ.60 నుంచి రూ.వంద వరకు పెరుగుదల
- సెంచరీ దిశగా టమోటా..మిర్చి
- కొత్తిమేర కేజీ రూ.200
- ఉల్లి, బంగాళ దుంప, క్యారెట్ ధరలకూ రెక్కలు
- దళారులతో జేబులకు చిల్లు
- హోల్ సేల్, రిటైల్‌కు భారీ వ్యత్యాసం

- కూరగాయాలు

వెజ్‌ట్రబుల్స్

ఒంగోలు సెంట్రల్: బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు చుక్కలనంటుతున్నాయి. అధికారుల చర్యలు లేక దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో హోల్ సేల్, రిటైల్ వ్యాపారులకు మధ్య ధరలో బాగా వ్యత్యాసం ఉంటోంది. దళారీ వ్యవస్థ బాగుపడుతుందే తప్ప ఉద్యాన రైతులకు మాత్రం తగిన ప్రతిఫలం దక్కటం లేదు. గతంలో రూ.వందతో సంచి నిండా సరుకులు వచ్చినా ఇప్పుడు రూ.500 ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరిగిన ధర రైతులకు గిట్టుబాటు కాకపోగా దళారులు, రిటైల్ వ్యాపారులకు లాభాలు వర్షం కురిపిస్తోంది. ఉద్యాన రైతులు రేయింబవళ్లు, ప్రకృతి వైపరీత్యాలను సైతం ఎదిరించి కష్టించి పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయించిన ధర కన్నా వినియోగదారుడి చేతికొచ్చేసరికి మూడు రెట్లు అవుతోంది.

ఎండా కాలం కారణంగా జిల్లాలో ప్రధానంగా గిద్దలూరు, బేస్తవారిపేట, చీమకుర్తి, దర్శి, కురిచేడు, కొత్తపట్నం, మార్టూరు, బల్లికురవ, ఇతర మండలాల నుంచి వచ్చే కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఆయా మండలాల్లో కేవలం 70 ఎకరాల్లో మాత్రమే చిన్న కమతాలలో ఆకు కూరలు, కూరగాయలు సాగవుతున్నట్లు ఉద్యానవన శాఖ లెక్కలు తేల్చింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవటం ధరల పెరుగుదలకు కారణమైంది. ఆగస్టు నాటికి కొంత పంట అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు ఈ ధరలు ఇంచు మించు ఇదే విధంగా ఉంటాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. పచ్చి మిర్చి, టమోటా ధరలు సెంచరీ వైపు చూస్తుండగా, మిగతా ధరలు రూ.60 నుంచి రూ.200 వరకూ ఉన్నాయి.



నాయుడు పాలెంలో సాగు చేసిన దొండ తోట

వంటింట్లో ఉల్లికి పాట్లు ..



ఉల్లిపాయలు కొనాలంటేనే వినియోగదారులకు కన్నీళ్లు వస్తున్నాయి. అకాల వర్షాలకు రాష్ట్రంలో కర్నూలు, అనంతపురం, నంద్యాల ప్రాంతాల్లో పంట తీవ్రంగా దెబ్బతింది. ఇదే క్రమంలో మహారాష్ట్రలోని నాసిక్, షోలాపూర్, నాందేడ్, నాగపూర్, కామత్ నగర్‌ల నుంచి దిగుమతులు తగ్గిపోవటంతో ఉల్లి ధర పెరుగుతూ వస్తోంది. ఇదిలా ఉంటే హోల్ సేల్ వ్యాపారులు ఉల్లి పాయలను నిల్వ చేసుకుని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే వాదన కూడా వినిపిస్తోంది.

మిర్చికి ధరల ఘాటు:

పచ్చి మిర్చి ధరల ఘాటు రోజు రోజుకూ పెరుగుతోంది. అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో నెల రోజుల వ్యవధిలో వీటి ధర మూడు రెట్లు పెరిగింది. ఈనెల ప్రారంభంలో కిలో మిర్చి ధర రూ.30 ఉండగా, దశల వారీగా ప్రస్తుతం రూ.90కి చేరింది. వాతావరణం అనుకూలించకపోవడంతో పాటు తెగుళ్ల బెడదతో పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. మిర్చి దిగుమతి చేసుకునే చెన్నై, గుంటూరు, కంభం తదితర ప్రాంతాల్లోని కొత్త పంట చేతిక అందకపోవటం సమస్యగా మారింది.



కూరగాయల మార్కెట్‌లో ధరలు విచారిస్తున్న వినియోగదారులు

టమోటా... వంద మాట



ప్రతి వంటకంలో విరివిగా ఉపయోగించే టమోటా ధర రూ.వందకు చేరింది. రాష్ట్రంలో ప్రధానంగా మదనపల్లి కేంద్రంగా రాయలసీమలోని అనేక మండలాల్లో టమోటా పండిస్తారు. ఈ తోటల్లో ఉత్పత్తి తుది దశకు చేరుకోవటంతో మదనపల్లి మార్కెట్‌లో టమోటా సరఫరా గణనీయంగా తగ్గిపోయింది. ఇదే క్రమంలో రాష్ట్రంలోని మార్కెట్ కంటే చెన్నై మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉండటంతో అక్కడ అధిక ధర ఉంది. దీంతో కొంత మంది హోల్‌సేల్ వ్యాపారులు రాష్ట్రంలోని వ్యాపారులకు సరఫరా తగ్గించి చెన్నైకి తరలించటం టమోటా ధర పెరుగుదలకు కారణమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే కొత్తిమేర ధర ఈ ఏడాది జనవరిలో దారుణంగా పడిపోవడంతో అనేక మంది రైతులు పంట మార్పిడి చేశారు. అప్పటి నుంచి వేసవి ప్రారంభమయ్యే నాటికి కొత్తిమేర పంట పూర్తిగా తగ్గిపోవటంతో కొరత తీవ్రమైంది. దీంతో కొత్తిమేరను సైతం బెంగళూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం కిలో ధర రూ.200లకు చేరింది.

చుక్కల్లో చిక్కుళ్లు:

ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి వస్తున్న దేశవాళీ చిక్కుడు (నాటు) కాయలు ప్రస్తుతం కేజీ రూ.70, బీన్స్ కిలో రూ.200 పలుకుతుంది. పెద్దచిక్కుడు కాయలు కిలో రూ.90 వరకు విక్రయిస్తున్నారు. జిల్లాలో గిద్దలూరు, దర్శి, తాళ్లూరు ప్రాంతాల్లో చిక్కుళ్లు పండిస్తుంటారు. ప్రస్తుతం అవసరాలకు తగినంత చిక్కుళ్ల సరఫరా లేకపోవటంతో వాటి ధర అదే స్థాయిలో కొనసాగుతోంది.

కూరగాయలు	హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో ధర రూ.	రిటైల్ మార్కెట్‌లో కిలో ధర రూ.
ఉల్లి	35	40
పచ్చిమిర్చి	40	90
అల్లం	180	200
బంగాళదుంపలు	40	80
వంకాయలు	40	60
బెండకాయలు	35	60
క్యారెట్	50	85
బీట్ రూట్	40	60
కాప్సికమ్	70	80
కాలీఫ్లవర్	40	60
గోరుచిక్కుడు కాయలు	80	100
అరటి కాయ(ఒకటి)	10	12
దొండ కాయలు	30	50
టమోటా	75	90
బీరకాయలు	60	80
పెద్దచిక్కుళ్లు	40	70
కాకర కాయ	70	80
బీన్స్	180	200
పొట్లకాయ	40	70
ముల్లంగి	40	60
దోసకాయ	30	60
కొత్తిమీర (కట్ట)	45	60
సొరకాయ(ఒక్కొక్కటి)	10	30
మునక్కాయలు	120	150
కరివేపాకు	20	30
ఆకుకూరలు		
గోంగూర (కట్ట)	7	10
తోటకూర	7	10
చుక్క కూర	7	10
పాల కూర	7	10

అదే దారిలో ఆకుకూరలు:



కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో వినియోగదారులు ఆకుకూరలతో సరిపెట్టుకుంటున్నారు. దీంతో తోటకూర, గోంగూర, పాలకూర, మెంతికూర, చుక్కకూరలకు డిమాండ్ పెరిగింది. ఇది ధరల పెరుగుదలకు కారణమైంది. గతంలో ఒక్కో ఆకుకూర కట్ట రూ.8 నుంచి జత రూ.15 ఉండగా, ప్రస్తుతం రూ.20 విక్రయిస్తున్నారు. కొత్తిమీర కట్ట రూ.పది నుంచి రూ.25కు చేరింది.

ధర ఉన్నా దిగుబడి లేదు



ప్రస్తుతం కూరగాయలకు ధర ఉన్నా దిగుబడి లేకుండా పోయింది. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న పంట చివరి దశకు చేరుకుంది. దీంతో ఈ ఏడాది కూరగాయల సాగు అంత ఆశాజనకంగా లేకుండా పోయింది. ఇప్పుడు ధర ఉందని సంతోషంగా ఉన్నా దిగుబడి లేక దిగాలు తప్పటం లేదు.

– ఎస్ వెంకటేశ్వర్లు, యూఎంపురం, ముండ్లమూరు మండలం.

అమ్మో కొనలేకపోతున్నాం..



బహిరంగ మార్కెట్‌లో పెరిగిన కూరగాయల ధరలు చూస్తుంటే భయమేస్తుంది. హోల్ సేల్ కూరగాయలు తక్కువగా ఉన్నా ఆ ప్రయోజనాలను మాత్రం దళారులు వినియోగదారులకు చేరనివ్వటం లేదు. రైతు బజార్లు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది.

– మరియమ్మ, వినియోగదారురాలు, ఒంగోలు.

దిగుబడి లేకపోవటంతోనే..



అధిక ఎండల వలన కూరగాయల పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గిపోవటంతో ధరలు పెరిగిపోతున్నాయి. నాణ్యమైన సరుకు రావటం లేదు. రవాణాలో కూరగాయలు పాడైపోవటం వలన వ్యాపారులు నష్టపోతున్నారు. మరికొద్ది రోజులు ఈ ధరలు కొనసాగే అవకాశం ఉంది.

– ప్రసాద్, దుకాణదారు, తూర్పుగంగవరం.



సొర తోట

మళ్లీ మంచి రోజులు వస్తాయి

- అధైర్యపడవద్దు అండగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల

కొనకనమిట్ల: అధికారంలోకి రాలేకపోయామని ఎవరూ అధైర్య పడవద్దని దేవుని దయ, ప్రజల ఆశీస్సులతో మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. వాగుమడుగు పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు విద్యుత్ ప్రభలపై స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు పోలేరమ్మతల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగించారని వారు గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. నాలుగు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసిన



అన్నా, ఉడుములను సన్మానిస్తున్న నాయకులు

ఎంపీటీసీ పెన్నెబోయిన కృష్ణవేణి కోటయ్యయాదవ్, బొరిగొర్ల బాలయ్యయాదవ్, బిందె పెద్దసుబ్బయ్య, చినసుబ్బయ్య, పోలయ్యయాదవ్, చిందె నాగేశ్వరరావు, కాలె రమణయ్య, డి.మాలకొండయ్య, అంబోరి సంగన్న, తిరిపాలు, గ్రామ పార్టీ కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, సర్పంచ్‌లు కమలాకర్, పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, ఎస్సీసెల్ కార్యదర్శి చిరుగూరి కోటేశ్వరరావు, పాతకోట శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు, పలు శాఖల అధికారులు

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాల నిర్వహణ

ఒంగోలు సెంట్రల్: క్షేత్ర స్థాయిలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల సమస్యలను తీర్చాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశం జిల్లా పరిషత్ అధ్యక్షురాలు బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన ఆదివారం ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి సీ హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, చీరాల ఎమ్మెల్యే ఎం.మాల కొండయ్య, పలు కమిటీల సభ్యులు మారెడ్డి అరుణ, చుండి సుజ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి పనులు, ఆర్థిక విషయాలపై సమీక్షలలో మూడు జిల్లాల అధికారులు, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎరక్కపోయి..ఇరుక్కుపోయి

టంగుటూరు: ఓడబ్బాలో ఉన్న మంచినీళ్లు తాగేందుకు అందులో తలపెట్టిన ఓ కుక్క తల ఇరుక్కుపోయి నరకయాతన పడింది. టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెంలో ఆదివారం నీళ్లు తాగబోయి డబ్బాలో తల ఇరికించుకున్న కుక్క దిక్కుతోచక గ్రామంలో ఉదయం నుంచి తిరుగుతూనే ఉంది. ఎట్టకేలకు గ్రామానికి చెందిన పెండ్యాల వేణు అనే యువకుడు కుక్క తలకు ఇరికించుకున్న డబ్బాను తీయడంతో బతుకు జీవుడా అంటూ వెళ్లిపోయింది.



కాకుటూరివారిపాలెంలో తలకి డబ్బా ఇరికించుకున్న కుక్క

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



ర్యాలీలో ఆంజనేయ స్వామి, ఛత్రపతి శివాజీల విగ్రహాలు

కనిగిరి రూరల్: హనుమాన్ శోభాయాత్ర ఆదివారం కనిగిరిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక గార్లపేట రోడ్డులోని వెంకటేశ్వర స్వామి గుడి వద్ద నుంచి ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్ర ర్యాలీ పట్టణ పుర వీధుల నుంచి కొత్తూరు ఆంజనేయ స్వామి గుడి వరకు సాగింది. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలీకి అగ్రభాగాన ప్రత్యేక వాహనంపై పది అడుగుల హనుమంతుని, ఛత్రపతి శివాజీల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ర్యాలీలో హనుమాన్ శోభయాత్ర కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, కంటు గురవయ్య, రామసుబ్బారెడ్డి, అచ్చాల శ్రీను, మాజీ వైస్ చైర్మన్ వీవీ ఆర్ మనోహర్ రావు, టీడీపీ నాయకులు రాచమళ్ల శ్రీను, తమ్మినేని శ్రీను, తమ్మినేని వెంకటరెడ్డి, కే శ్రీను, హనుమాన్ యాత్ర కమిటీ నాయకులు అనీల్ కుమార్, వెంకటేష్, పెద్దిరెడ్డి, నవీన్, ఉమాకాంత్, ఇందుకుమార్, ప్రసన్న, వంశీ, పవన్, బ్రాహ్మణ సంఘ నాయకులు సంగరాజు సాయి మనోజ్, ధూళిపాళ్ల మల్లికార్జునరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ శోభాయాత్ర ర్యాలీ



ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కంభంరోడ్డులో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి షష్ఠమ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6 గంటలకు గోపూజ, విష్వక్సేన ఆరాధన, అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం వెంకటేశ్వరస్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి శేషవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరప్పాడు సమీపంలో ఉన్న కపిల్ వెంచర్స్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్తులు ఆదివారం గుర్తించారు. మృతదేహం పాడైపోయి పురుగులు పట్టి ఉండటంతో వారు ఎస్సై మహేష్‌కు సమాచారం అందించారు. రూరల్ సీఐ, ఎస్సైలు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు 30 నుంచి 35 ఏళ్ల లోపు హిజ్రా అయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పీడీ

తాళ్లూరు(ముండ్లమూరు): జాతీయస్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. ఇటీవల భీమునిపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ రగ్బీ టోర్నమెంట్లో ప్రతిభచూపిన గంజకుమార్ శివరామకృష్ణను జూనియర్ విభాగంలో జాతీయస్థాయికి ఎంపిక చేసినట్లు పీడీ ఎస్ రవిప్రసాదరెడ్డి తెలిపారు. ఈ నెల 25, 26, 27 పూణెలో జరగనున్న టోర్నమెంట్‌లో శివరామకృష్ణ పాల్గొననున్నారు. కుమార్ శివరామకృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ వై కృష్ణారెడ్డి, సర్పంచ్ మందా శ్యాంసన్, ఉప సర్పంచ్ పులి ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ కొప్పుల బాలకోటయ్య, గ్రామస్తులు అభినందించారు. విద్యార్థులు క్రీడా రంగంలో రాణిస్తున్నందున పాఠశాల పీడీని ప్రశంసించారు.

జనసేన కార్యాలయం వద్ద ధర్నా

ఒంగోలు: సింగరాయకొండ జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ సానుభూతిపరులు శనివారం కొంతసేపు ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే..పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్, అడుసుమల్లి సుధాకర్ వర్గాల మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ నాయకులు రాజేష్‌కు ఇచ్చిన పార్టీ ఫండ్‌కు సంబంధించి లెక్కలు చెప్పాలని డిమాండ్ చేయడంతో ఈ గొడవ ప్రారంభమైందని ఆ పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది రోజుల్లోనే ఇలాంటి కార్యక్రమాలతో రచ్చకెక్కడం చర్చనీయాంశంగా మారింది.

విద్యుదాఘాతానికి గేదెలు మృతి

పీసీపల్లి: విద్యుదాఘాతానికి రెండు గేదెలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే..మండల పరిధిలోని విఠలాపురంకు చెందిన మడతల మది రెడ్డి భార్య శంకరమ్మలు తమకున్న రెండు గేదెలను మేతకు పొలానికి తీసుకెళ్తున్నారు. దారిలో ఎల్‌టీలైన్‌లు ఒకదానికొకటి రాసుకొని తెగిపడి గేదెలపై పడ్డాయి. దీంతో గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్ ఏఈ లక్ష్మీ ప్రసన్న, లైన్‌మెన్‌లు పరిశీలించారు.


మృతిచెందిన గేదెలు

కమనీయం.. కల్యాణోత్సవం


గ్రామ పురవీధుల్లో రథోత్సవం


నారశింహుని కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి స్వామి

- వైభవంగా సాగిన రథోత్సవం
- స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహలక్ష్మీ నరశింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి కల్యాణోత్సవం, రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వయోవృద్ధులు, సచివాలయం, గ్రామ వలంటీర్ల శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రికి పూర్ణ కుంభంతో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఈఓ పి.కృష్ణవేణి స్వాగతం పలికారు. మంత్రి స్వామి రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకువచ్చిన పట్టువస్త్రాలను నరశింహస్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు


నారశింహునికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు తీసుకుని వస్తున్న మంత్రి స్వామి

భారీగా భక్తులు తరలివచ్చారని, వారంతా కల్యాణాన్ని తిలకించేలా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. కల్యాణోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీనరశింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కల్యాణోత్సవానికి జెడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా ఉభయదాతలుగా వ్యవహరించారు. తరువాత భక్తులకు స్వామి అక్షింతలు పం


కల్యాణోత్సవాన్ని భారీగా తిలకిస్తున్న మహిళలు

పిణీ చేశారు. సాయంత్రం స్వామి రథోత్సవం గ్రామ పురవీధుల్లో వైభవంగా సాగింది. స్వామిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై ఆశీసులని చేసి రథోత్సవం సాగింది. గత ఏడాది రథోత్సవంలో అపశృతులు పునరావృతం కాకుండా సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి.శ్రీరాం తీసుకున్న ముందస్తు చర్యల కారణంగా రథోత్సవం జయప్రదంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ఏరువాక
పోలేరమ్మ జాతర


ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


దగదగలాడుతున్న వైఎస్సార్ సీపీ ప్రభ

- భక్తులతో పులకించిన వాగుమడుగు
- వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు
- పోటాపోటీగా విద్యుత్ ప్రభల ఏర్పాటు

కొనకనమిట్ల: ఏరువాక పోలేరమ్మతల్లి జాతరను పురస్కరించుకొని మండలంలోని వాగుమడుగు గ్రామం భక్తులతో పులకించింది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు పాల్గొని పోలేరమ్మతల్లికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ముందుగా అమ్మవారి కలశాన్ని గ్రామంలో ఉత్సవం నిర్వహించి ఆలయంలోకి తీసుకువచ్చారు. పలువురు భక్తులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నాలుగు, టీడీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో


అలంకరణలో పోలేరమ్మతల్లి, పోతురాజు

భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం వాగుమడుగు, రేగడపల్లి గ్రామాల ప్రజలు అమ్మవారికి కుంకుమ బండ్లు కట్టి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు నైవేద్యాలతో వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొదిలి సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో కొనకనమిట్ల ఎస్సై కె.మాధవరావు సిబ్బందితో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.


ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు

క్రీడలతో క్రమశిక్షణ


ఒలంపిక్ రన్‌ను జెండా ఊపి ప్రారంభించిన చైర్మన్ గోరంట్ల రవికుమార్

- జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ గోరంట్ల రవికుమార్

ఒంగోలు: క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని ప్రకాశం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ గోరంట్ల రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం భవనం వద్ద ఒలంపిక్ పరుగు కార్యక్రమాన్ని సోమవారం ఆయన జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఐకమత్యం నెలకొంటుందని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఒలంపిక్ రన్‌లో పాల్గొనడం ద్వారా సమాజంలో శాంతి సిద్ధిస్తుందన్నారు. క్రీడలు శాంతి, ఐక్యతకు వారధి లాంటివని పేర్కొన్నారు. ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ 1948 జూన్ 23న తొలి ఒలంపిక్ రన్ ప్రారంభమైందని, అప్పటి నుంచి ఏటా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. క్రీడోత్సాహాన్ని పెంపొందించేందుకు క్రీడాకారులతో పాటు క్రీడాభిమానులు కూడా ఈ పరుగులో పాల్గొంటుంరన్నారు. చాలా దేశాల్లో పాఠ్యాంశాల్లో సైతం ఒలంపిక్ పరుగు గురించి విద్యార్థులకు తెలిసేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు.

అనంతరం అర్చరీ, ఫెన్సింగ్, కరాటేలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను స్థానిక మినీ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. కోశాధికారి ఎస్.చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ ధనుంజయరావు, డాక్టర్ ఆంజనేయులు, శశికాంత్‌భూషణ్, సిరిగిరి రంగారావు, జాయింట్ సెక్రటరీ దాసరి రమేష్‌బాబు, రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సువర్ణరాజు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వనజ, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం భవనం వద్ద నుంచి మినీ స్టేడియం వరకు 100 అడుగుల జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ మృతి

మాచారెడ్డి: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మేస్త్రీ మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన రసూల్(32) అనే మేస్త్రీ కొన్నేళ్ల క్రితం మాచారెడ్డి మండలానికి వలసవచ్చాడు. చుక్కాపూర్ గ్రామంలో నివసిస్తూ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం నడుచుకుంటూ ఘన్‌పూర్ గ్రామంవైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి కుటుంబం ఆంధ్రప్రదేశ్‌లోని కనిగిరిలో నివసిస్తోందని స్థానికులు తెలిపారు.

అడవిలో మంటలు

- 10 ఎకరాల్లో జామాయిల్, 4 ఎకరాల్లో మామిడి తోటలు దగ్ధం

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులోని పాత ఎరుకల సంఘం గేటు పక్కన ఉన్న అడవిలో మంటలు వ్యాపించాయి. తొలుత జామాయిల్ తోటల్లో మంటలు వ్యాపించాయి. తరువాత క్రమంగా పక్కనే ఉన్న మొగిలి భరత్‌కు చెందిన మామిడి తోటలకు అంటుకున్నాయి. దీంతో తోటల యజమాని అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే వారు రాలేదని స్థానికులు తెలిపారు. మంటలు క్రమంగా పెరగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే ఫైర్ ఇంజన్ వచ్చినా ఘటనా ప్రాంతానికి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోయింది. దాదాపు 10 ఎకరాల్లో జామాయిల్, 4 ఎకరాల్లో మామిడి తోటలు దగ్ధమయ్యాయి.


రాత్రి సమయంలో ఎగిసిపడుతున్న మంటలు


అడవిలో వ్యాపించిన మంటలు

అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారు..!


అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లు

కొండపి(సింగరాయకొండ): మండల కేంద్రంలో కొండపి చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. ఆదివారం భారీ యంత్రాలను తీసుకువచ్చి మట్టి తవ్వకాలు చేపట్టారు. ఎటువంటి అనుమతులు లేకుండా రేయింబవళ్లు యంత్రాలతో మట్టిని తవ్వుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువులో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ మధుబాబును వివరణ కోరగా..అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే సిబ్బందిని పంపించి పనులు నిలిపివేయిస్తానని తెలిపారు.

శేష వాహనంపై తిరుమలనాథస్వామి


శేష వాహనపై శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి


అలంకరణలో తిరుమలనాథస్వామి


అలంకరణలో అమ్మవారు

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడో రోజు ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి భక్తులు పూజలు చేశారు. అర్చకులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు అభిషేకం, అర్చనలు, మంగళ హారతి, తదితర పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారు శ్రీరామచంద్రమూర్తి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం రాత్రి శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి కొలువుతీరారు. అలయ ప్రాంగణంలో మేళతాళాల మధ్య భక్తి పాటలు పాడుకుంటూ భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం రెడ్ల సత్రంలో అన్నదాన కార్యక్రమం, ఆలయం ప్రాంగణంలో తెలుగు రాష్ట్రాల స్థాయి ఆరు పండ్ల సైజు విభాగంలో ఎడ్ల పందెలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

క్రమశిక్షణతో అత్యున్నత శిఖరాలకు

- పద్మశ్రీ సంతోష్ యాదవ్

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు ప్రతిభతో క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరాలని ఎవరెస్ట్ శిఖరాన్ని రెండుసార్లు అధిరోహించిన మహిళ పద్మశ్రీ సంతోష్ యాదవ్ అన్నారు. ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం జై శ్రీక్రిష్ణ బీసీ సమితి సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 మండలాల్లో పదో తరగతిలో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రముఖ వైద్యుడు పెరుగు మురళీక్రిష్ణ యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ సంతోష్ యాదవ్ మాట్లాడుతూ విద్యతో పాటు సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని కోరారు. మరో అతిథి బీవీ రమణకుమార్ మాట్లాడుతూ సంస్థలోని సభ్యుల అందరి కృషితో విద్యార్థులకు చేయూతతో పాటు అనేక కార్యక్రమాల నిర్వహణ సాధ్యమైందన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు ద్రావిడ దేశం క్రిష్టారావు మాట్లాడుతూ తాను చదువుకునే సమయంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నానని, తన ఎదుగుదలకు అనేక మంది సహాయ పడ్డారని చెప్పారు. నేడు సహాయం పొందిన విద్యార్థులు రానున్న కాలంలో సమాజ సేవలో పాలుపంచుకోవాలని కోరారు. డాక్టర్ పెరుగు మురళీక్రిష్ణ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా సహకారం అందించానని తెలిపారు. సివిల్ కోచింగ్ వెళ్లే పేద విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం జిల్లాలో 500 పైన మార్కులు వచ్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను 138 మందికి అందజేశారు. అడకా స్వాములు, కమిటీ సభ్యులు డాక్టర్ కాకు శ్రీకాంత్ యాదవ్, పిచ్చయ్య యాదవ్, పేగడ శ్రీనివాస క్రిష్ణ, రంజిత్ కుమార్, గురు ప్రసాద్, బంక చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. లావణ్య లహరి సాయిత్రీభాయి పూలే ఏకపాత్రాభినయంతో పాటు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.


అతిథులను సన్మానిస్తున్న, జై శ్రీక్రిష్ణ బీసీ సమితి బాధ్యులు

టీడీపీలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

- పాటకచేరి సందర్భంగా ఘటన
- అల్లరిమూకను చెదరగొట్టిన పోలీసులు
- భయభ్రాంతులకు గురైన భక్తులు


పాటకచ్చేరిలో యువకునిపై దాడిచేస్తున్న దృశ్యం


ఆందోళనకారులను చెదరగొడుతున్న ఏఎస్సై బాషా

ఒంగోలు: సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ వరాహాలక్ష్మీనరశింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దేవస్థానం, శ్రీ కృష్ణ యాదవ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాటకచేరి రసాభాసగా మారింది. టీడీపీలోని ఒక వర్గం పార్టీ పాటలే ప్రదర్శించాలని డిమాండ్ చేయగా.. మరొక వర్గం దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమమని, అన్ని పాటలు పాడతారని చెప్పడంతో రెండు వర్గాల మధ్య గొడవ ప్రారంభమైంది. ఈ ఘర్షణలో టీడీపీ వర్గీయులు బాపట్ల శివకుమార్, మించాల బ్రహ్మయ్యకు మధ్య జరిగిన తోపులాటలో శివకుమార్ స్టేజీ పైనుంచి బ్రహ్మయ్యను నెట్టివేయడంతో కిందపడిపోయాడు. దీంతో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గొడవ తీవ్రమైంది. భక్తులు భయభ్రాంతులకు లోనై పరుగులు తీశారు. దీంతో అక్కడే ఉన్న ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా, రైటర్ షేక్ షాకీర్ బాగాలు లాఠీ ఛార్జి చేసి అక్కడి వారందరినీ చెదరగొట్టి పరిస్థితిని అదుపులోనికి తీసుకున్నారు. ఈ క్రమంలో శివకుమార్‌ను అక్కడ ఉన్న వారు తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు లాఠీచార్జి చేసే క్రమంలో శివకుమార్ అక్కడ నుంచి తప్పించుకోవడంతో తరువాత అతని ఇంటిపై దాడికి ప్రయత్నించారు. అయితే పోలీసులు, స్థానికులు సర్దిచెప్పడంతో పరిస్థితి సర్దుమణి గింది. ఆ తరువాత ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా..మంత్రి డోలా వీరాంజనేయస్వామి హెచ్చరికతో ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. శివకుమార్, బ్రహ్మయ్యల మధ్య పాతకక్షలే గొడవకు కారణమని పోలీసులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రశాంతానికి ఆలయానికి వచ్చిన భక్తులు టీడీపీ నేతల ఘర్షణతో భయభ్రాంతులకు లోనయ్యారు. ఆలయ పరిసరాల్లో ఇటువంటి గొడవలు ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.